మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలి

పెద్దపల్లి, ఫిబ్రవరి4: జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయిల్ పామ్ మొక్కల గ్రౌండింగ్, ఎరువుల లభ్యతపై సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ప్రస్తుత సంవత్సరంలో జిల్లాలో 750 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటినట్లు తెలిపారు. నిర్దేశిత లక్ష్యం వెయ్యి ఎకరాలకు పెంచాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగుతో కలిగే లాభాలను రైతులకు వివరించాలన్నారు. మండలంలో ప్రైవేట్ వ్యాపారుల వద్ద ఉన్న స్టాక్ తనిఖీ చేస్తూ ఎక్కడ కృత్రిమ కొరత సృష్టించకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పంటల క్రాప్ బుకింగ్ పకడ్బందీగా పూర్తి చేయాలని, ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగు అవుతున్నాయో పక్కా వివరాలు ఉండాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి దోమ ఆదిరెడ్డి, డీహెచ్ఎస్‌వో జగన్మోహన్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

డైరీ విడుదల

తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(టీజీఆర్ఎస్ఏ) డైరీ, టేబుల్, వాల్ క్యాలెండర్‌ను కలెక్టర్ కోయ శ్రీహర్ష కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విడుదల చేశారు. అదనపు కలెక్టర్లు అరుణ శ్రీ, దాసరి వేణు, పెద్దపల్లి ఆర్డీవో గంగయ్యకు అందజేశారు. టీజీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు రాపెల్లి రాముడు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, కలెక్టర్ సీసీ(తసీల్దార్) సురేందర్, కలెక్టరేట్ పర్యవేక్షకుడు బండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి చిలగాని అనిల్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటన

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నా క్లయింటు కుక్క జ్యోతి భర్త : బొంకూరి చిరంజీవి, నివాసం:4-2-17 ఉదయ్‌నగర్, పెద్దపల్లి జిల్లా & మండలము, కుక్క జ్యోత్స్న తండ్రి: రాజయ్య గార్ల నుండి పెద్దపల్లి పట్టణములోని కుక్క జ్యోత్స్న , తండ్రి: రాజయ్య గారి పేరు మీద గల ఇంటి నం.4-3-172/ఏ, విస్తీర్ణం: 123.75 చదరపు గజాలు నాక్లయింటు కుక్క జ్యోతి గారు రిజిస్టర్ గిఫ్ట్ డీడ్ నం.4290/2024 తేది:05-10-2024 ద్వారా పొంది ఉన్నారు. ఇట్టి ప్రాపర్టీకి హద్దులు ఉత్తరం: కుక్క రాజయ్య ఇల్లు, తూర్పు: దారి, పడమర: దుర్గయ్య గారి ఇల్లు. కావున పై ప్రాపర్టిపై ఎవరికైనా హక్కులు గానీ, అభ్యంతరములు గానీ ఉన్న యెడల వ్రాత పూర్వకముగా ఆధారాలతో ఏడు రోజులలో ఈ క్రింది చిరునామాలో గల వారికి తెలుపగలరు.

Sd/-**కె. శ్రీనివాస్,** అడ్వకేట్
ఇ.నెం. 2-70/2, రంగంపల్లి, పెద్దపల్లి
సెల్: 9154547272,9505061000

ఉచిత శిక్షణ

పెద్దపల్లి, ఫిబ్రవరి4: తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్సీ, బ్యాంకింగ్ రిక్రూట్మెంట్ ఫౌండేషన్ కోర్సుల ఉచిత శిక్షణకు కోసం దరఖాస్తు చేసుకోవాలని స్టడీ సర్కిల్ కరీంనగర్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన నిరుద్యోగులు ఈనెల 9 వరకు వెబ్ సైట్ WWW. tgbcstudy cir cle. cgg. gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్, డిగ్రీలో వచ్చిన మార్కులతో పాటు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎంపిక ఉంటుందని వివరించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈనెల 12 -14వరకు ఉంటుందని వెల్లడించారు. వివరాలకు 0878-2268686 నంబర్‌ను లేదా కరీంనగర్ లోని బీసీ స్టడీసర్కిల్ కార్యాలయంలో ఆఫీస్ వేళల్లో నేరుగా సంప్రదించాలన్నారు.

ఖనిలో మళ్లీ 'ఆపరేషన్ కూల్చివేత'

కోల్‌సిటీ, ఫిబ్రవరి 4: రామగుండం నగర పాలక సంస్థ మళ్లీ ఆపరేషన్ కూల్చివేత చర్యలు చేపట్టింది. ఈసారి గోదావరిఖనిలోని ప్రధాన వ్యాపార కేంద్రమైన లక్ష్మీనగర్‌లో మంగళవారం రాత్రి నుంచి కూల్చివేతలకు దిగింది. టౌన్ ప్లానింగ్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు మధ్య గతంలో రోడ్ల వెడల్పు కోసం మార్కింగ్ చేసిన ప్రాంతాల్లో దుకాణాల ముందు భాగాలను ప్రొక్లయిన్ సాయంతో కూల్చివేశారు. రోడ్ల వెడల్పులో భాగంగా ఎక్కడి వరకైతే మార్కింగ్ చేశారో అక్కడి వరకు తొలగించాలని దుకాణాల యజమానులకు సూచించారు. లేదంటే తామే కూల్చివేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రస్తుతాని దుకాణాల ముందు భాగాలను కూల్చివేశారు. పదిహేను రోజుల క్రితం స్థానిక ప్రధాన చౌరస్తాలోని షాపింగ్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న దుకాణాలను కూల్చివేసిన బల్దియా అధికారులు కొద్ది రోజులు స్తబ్ధతగా ఉన్నట్టు ఉండి మంగళవారం రాత్రి లక్ష్మీనగర్‌లో రోడ్ల వెడల్పు పేరుతో కూల్చివేతలు చేపట్టారు. ఈవిషయం తెలియడంతో స్థానికులు సంఘటన స్థలానికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు.

గోదావరిఖని లక్ష్మీనగర్‌లో కూల్చివేస్తున్న బల్దియా సిబ్బంది

సుల్తానాబాద్‌లో వాకర్స్‌తో ఎమ్మెల్సీ అభ్యర్థి రవీందర్‌సింగ్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక్కసారి అవకాశమివ్వండి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 4: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థి సర్దార రవీందర్‌సింగ్ కోరారు. మంగళవారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలిసి ముఖాముఖి చర్చించారు. ఇప్పటి వరకు పోటీ చేసిన వారంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం ఆరాటపడటమే తప్ప అభివృద్ధి కోసం ఏనాడైనా పాటు పడ్డారా అని అన్నారు. తాను కౌన్సిలర్‌గా ఎన్నోసార్లు గెలిచాననీ, ఏనాడూ రుపాయి తీసుకున్న దాఖలాలు లేవన్నారు. రూపాయికే నల్ల కనెక్షన్ ఇచ్చిన ఘనత తనదేనన్నారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరుద్యోగులు ఎంతమంది ఉన్న ఒక్క రూపాయికే ఇన్సురెన్స్ చేపిస్తాననీ హామీ ఇచ్చారు. సుల్తానాబాద్ వాకర్స్ కు ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మాజీ జడ్పీటీసీ అయిల రమేశ్, మంద శ్రీనివాస్, గొట్టం మహేశ్, తదితరులున్నారు.

రాగి తీగచోరీ

రామగిరి, ఫిబ్రవరి4 : బేగంపేట శివారులో రెండు రోజులు క్రితం ఎస్ ఎస్- 76/25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగను ఎత్తుకెళ్లారని ట్రాన్స్‌కో ఏఈ కే. మహేందర్‌రెడ్డి తెలిపారు. దీని విలువ రూ. 10 వేల వరకు ఉంటుందన్నారు. స్థానిక రైతులు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం వద్దు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 4: స్వచ్ఛ ఆటోడ్రైవర్లు చెత్త సేకరణ విధుల్లో నిర్లక్ష్యం చూపవద్దని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసీ) జే.అరుణ శ్రీ ఆదేశించారు. నగరంలోని పలు డివిజన్లలో మంగళవారం పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ, అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. 36వ డివిజన్‌లో స్వచ్ఛ ఆటో కొన్ని రోజులుగా రెండు ట్రిప్‌లకు బదులుగా కేవలం ఒక ట్రిప్ మాత్రమే పని చేస్తుండడాన్ని గుర్తించి హెచ్చరించారు. జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్ల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. 42, 46వ డివిజన్లలో మురుగు నీటి కాలువలను పరిశీలించారు. ప్రభుత్వ దవాఖానలో ఆవరణలో చెత్త తొలగింపు పనులను చూశారు. నిర్మాణం పూర్తయిన నైట్ షెల్టర్ పరిశీలించి ఉపయోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ ఎస్ఈ శివానంద్, ఈఈ రామన్, శానిటరీ ఇన్స్పెక్టర్ సునీల్ రాథోడ్, కుమారస్వామి ఉన్నారు.

ఇంటి పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం తగదు

కమాన్‌పూర్, ఫిబ్రవరి 4: ఇంటి పన్నుల వసూళ్లలో ఆయా కార్యదర్శులు నిర్లక్ష్యం చూపడం తగదని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య సూచించారు. కమాన్‌పూర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో కమాన్‌పూర్, రామగిరి మండలాల పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి పంచాయతీలో వంద శాతం ఇంటి పన్నులు వసూళ్లు చేయాలన్నారు. శ్మశాన వాటికల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వాణిజ్య లైసెన్స్‌లు, భవన నిర్మాణ అనుమతులు, సెల్ టవర్ల పునరుద్ధరణ కియరెన్స్ ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎల్పీవో కొమ్మెర సతీశ్, ఎంపీడీవో గంగాల లలిత, ఎంపీవోలు భాస్కర్, ఉమేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 4 : పట్టణంలోని కాల్వశ్రీరాంపూర్ రోడ్డులో పేరుకుపోయిన చెత్త తొలగించాలని పలువురు బీఆర్ఎస్ యూత్ నాయకులు కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. రోడ్డు పూర్తిగా అధ్వాన్నంగా మారిందన్నారు. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో దుమ్ముతో ప్రజలు, ప్రయాణికులు, దుకాణాదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారనీ తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఎండీ వాహిద్, గాజుల అరుణ్ కుమార్, అర్జున్, సంపత్, విజయ్ తదితరులున్నారు.

లక్షల డప్పుల ప్రదర్శన పోస్టర్ల ఆవిష్కరణ

ధర్మారం,ఫిబ్రవరి4: ఎస్సీ వర్గీకరణలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అధ్వర్యంలో ఈనెల7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న వెయ్యి గొంతులు- లక్ష డప్పుల ప్రదర్శన పోస్టర్లను ధర్మారంలో ఎమ్మార్పీఎస్ నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మద్దునాల మల్లేశం, ప్రధాన కార్యదర్శి శాతరాజుల సుమన్, నాయకులు బొల్లి స్వామి, గొట్టే లింగయ్య, దూడ సురేశ్, కాంపల్లి రాజేశం, కాశిపాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

డప్పులు అందజేత

ఓదెల, ఫిబ్రవరి 4: పొత్కపల్లి గ్రామానికి చెందిన వారికి 20 డప్పులను మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య మంగళవారం వితరణ చేశారు. వేల గొంతుకలు లక్ష డప్పులు కార్యక్రమానికి తరలి వెళ్లడానికి మాదిగలకు 20 డప్పులను మాజీ ఎమ్మెల్యే విరాళంగా అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శనిగరపు రమేశ్, శంకర్, శ్రీనివాస్, రాజనర్సు, కుమార్, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతను చాటాలి

జూలపల్లి, ఫిబ్రవరి 4 : మాదిగలంతా ఏకమై ఐక్యతను చాటాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ పిలుపునిచ్చారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో 'లక్ష డప్పులు-వెయ్యి గొంతుకలు' సాంస్కృతిక నిరసన ప్రదర్శన విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం జూలపల్లిలో పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఎక్కిరాల స్వామి, మామిడిపెల్లి కాంతయ్య, కన్నం రాంనారాయణ, చిలుక ఆనంద్, నెరువట్ల రామస్వామి, సీపెల్లి అంజయ్య, కొంకటి లక్ష్మణ్, మామిడిపెల్లి చంద్రశేఖర్, వడ్లూరి అంజయ్య, కొంకటి రాజు, వడ్లూరి కొండయ్య, కొంకటి అజయ్, కల్లపెల్లి కిషన్, కొంకటి సురేందర్, కొంకటి దేవేందర్ పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ల నంబర్లు బ్లాక్

కోల్‌సిటీ, ఫిబ్రవరి 4: రామగుండం నగర పాలక సంస్థకు చెందిన తాజా మాజీ కార్పొరేటర్లకు సంబంధించిన సెల్‌నంబర్లు మంగళవారం నుంచి పని చేయడం లేదు. నగర పాలక సంస్థ పాలక వర్గం ఏర్పడ్డాక ప్రభుత్వం నుంచి 50 మంది కార్పొరేటర్లు, ఐదు గురు కో-ఆప్షన్ సభ్యులకు ఒక్కొక్కరికి విలువైన వన్ ప్లస్ కంపెనీ సెల్‌ఫోన్‌తోపాటు ప్రత్యేక నంబర్లు కేటాయిస్తూ సిమ్‌లను అందజేశారు. వాటికి సంబంధించిన బిల్లులను నెలనెలా బల్దియానే చెల్లిస్తూ వచ్చింది. ఇటీవల పాలక వర్గం గడువు ముగిసిన నేపథ్యంలో మంగళవారం నుంచి కార్పొరేటర్లకు సంబంధించిన సెల్‌ఫోన్ల సేవలు స్తంభించాయి. ఇన్‌కమింగ్, ఔట్ గోయింగ్ కాల్స్ నిలిచిపోయాయి. ఐతే తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండానే అధికారులు తమ సెల్ నంబర్లను బ్లాక్ చేయడం సరికాదని పలువురు మాజీ కార్పొరేటర్లు ఆక్షేపిస్తున్నారు. ముందస్తు సమాచారం ఇస్తే ఈ నెల నుంచి తామే బిల్లులను చెల్లిస్తూ ఆ నంబర్లను వినియోగంలో ఉంచుకునే వాళ్లమని పేర్కొంటున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 4: కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, రాజీవ్‌రహదారిలో ఏర్పాటు చేసిన 17 సీసీ కెమోరాలను మంగళవారం గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనరెడ్డి ప్రారంభించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ఏర్పాటును ఈ సందర్భంగా సీఐ వివరించారు. ఇక్కడ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో సదరం క్యాంపులు

పెద్దపల్లి/ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 4: డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఈ నెలలో జిల్లాలో సదరం క్యాంపులు నిర్వహించనున్నట్ల జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6, 20తేదీల్లో పెద్దపల్లి ప్రభుత్వ దవాఖాన, ఈ నెల 14, 28న గోదావరిఖని ప్రభుత్వ దవాఖానలో సదరం క్యాంపులు ఉంటాయని పేర్కొన్నారు. ఈ శిబిరాల్లో వైకల్య నిర్ధారణ పరీక్షలు చేసి, మరుసటి రోజు సాయంత్రం సదరం సరిఫికెట్లు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. దివ్యాంగులు స్లాట్‌బుక్ చేసుకోవడానికి తేదీలు విడుదల చేశామని పేర్కొన్నారు. సదరం సర్టిఫికెట్లు తీసుకొని కాలపరిమితి అయిపోయిన వారు, కొత్తగా సర్టిఫికెట్ కావాల్సిన వారు ముందుగా పట్టణ పరిధిలోని ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లతో వికలాంగత్వ వైకల్య నిర్ధారణ పరీక్షలు చేయించుకోని మీసేవలో సదరం వైకల్యం అంచనా, ధ్రువీకరణ పత్రంతో ఈ నెల 5న ఉదయం స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ సభ్యులు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 4: ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పెద్దపల్లి షీటీమ్ ఇన్‌చార్జి ఎస్ లావణ్య, సభ్యురాలు స్నేహలత సూచించారు. పెద్దబొంకూర్‌లోని మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు మంగళవారం ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై షీటీమ్ ఇన్‌చార్జితో పాటు సభ్యురాలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శ్రీనివాస్, అకౌంట్స్ ఆఫీసర్ పవన్‌కుమార్ షీటీమ్ బృందం సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్జీ-2 ఉద్యోగులకు శాప్ పై శిక్షణ

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 4 : సింగరేణి సంస్థ ఆర్జీ-2 ఏరియాలో పని చేస్తున్న వివిధ విభాగాల ఉద్యోగులకు యాజమాన్యం శాప్‌పై శిక్షణనందించింది. మంగళవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి డీజీఎం (ఐటీ) హరిప్రసాద్ హాజరయ్యారు. ఉద్యోగుల జీతాలు, ఇతర ప్రమోషన్ల కోసం కంప్యూటర్‌లో ప్రోగ్రామింగ్ కోసం శాప్‌పై శిక్షణ ఇచ్చారు. కాగిత రహిత సింగరేణియే లక్ష్యంగా శాప్‌ను అమలు చేసేందకు యాజమాన్యం ముందుకు సాగుతున్నదన్నారు. కార్యక్రమంలో ఓసీపీ-3 అధికారి మధుసూధన్, ఏరియా ఇంజనీర్ నర్సింహారావు, వీకేపీ ఏజెంట్ నేహ్రూ, ఎస్ఓటుజీఎం రాముడు, పర్సనల్ డీజీఎం అనిల్ కుమార్, ఫైనాన్స్ అధికారి వెంకటరామచంద్ర, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కాగిత రహిత కార్యకలాపాలపై అవగాహన

రామగిరి, ఫిబ్రవరి 4: సింగరేణిలో కాగిత రహిత కార్యకలాపాలు నిర్వహించడానికి వివిధ గనుల విభాగాధిపతులకు అవ గాహన కల్పించారు. ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణను జీఎం సుధాకర్ రావు ప్రారంభించారు. కాగిత రహిత సేవలు భద్రతతో నిర్వహించడంతో పాటు సకాలంలో సంబంధిత అధికారుల ఆమోదం పొందేలా ఈ-ఆఫీస్ విధానాన్ని రూపొందించారని తెలిపారు. అనంతరం కార్పొరేట్ ఈఆర్‌పీ ఐటీ మేనేజర్ కిరణ్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్పొరేట్ డీజీఎం హరిప్రసాద్, ఏరియా ఇంజినీర్ శేఖర్‌బాబు, ఎస్‌వోటూ జీఎం ప రఘుపతి, బండి సత్యనారాయణ, ఫైనాన్స్ ఏజీఎం పీ శ్రీనివాసులు, అధికారులు వెంకటరమణ, రాజశేఖర్, రామ్మోహన్, చంద్రశేఖర్, సుదర్శనం, రాజేంద్రకుమార్, జనార్దన్ రెడ్డి, రాజారెడ్డి, కాశీ విశ్వేశ్వరరావు, సత్యనారాయణ, ఐలయ్య, డా.కల్యాణ్ చక్రవర్తి, రాజేశ్వరి, సుజిత్ పాల్గొన్నారు

ఓటర్ల జాబితా ప్రదర్శన

ధర్మారం,ఫిబ్రవరి4: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఓటర్ల జాబితాను ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ప్రదర్శించారు. మండలంలోని 29 పంచాయతీ జాబితాను వెల్లడించారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో రమేశ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాచూరి శ్రీధర్,కాంగ్రెస్ నాయకుడు కొత్త నర్సింహం పాల్గొన్నారు.

ముత్తారం, ఫిబ్రవరి 4: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సురేశ్ మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. మండలంలో 23,265 ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇందులో 11,369 మంది పురుషులు, 11,894 మహిళా ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. గతంతో పోలిస్తే ఈసారి 519 మంది ఓటర్లు పెరిగారని వివరించారు. రాబోయే ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఇక్కడ బీఆర్ ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు దొడ్డ బాలాజీ, బిరుదు గట్టయ్య, ఎంపీవో గోవర్ధన్ పాల్గొన్నారు.

తప్పుడు అఫిడవిట్ కేసులో ఒకరి అరెస్ట్

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 4: గోదావరిఖనిలోని కాకతీయనగర్‌కు చెందిన నరసింగోజు రాజేశ్‌కుమార్ తనపై ఎలాంటి కేసులు లేవని తప్పుడు అఫిడవిట్ సమర్పించడంతో మంగళవారం అతడిపి అరెస్ట్ చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసు వెరిఫికేషన్ కోసం దరఖాస్తులో అఫిడవిట్ సమర్పించారు. పోలీసు స్పెషల్ బ్రాంచీ ఉన్నతాధికారులు దర్యాప్తులో రాజేశ్‌కుమార్‌పై ఒక క్రిమినల్ కేసు ఉన్నట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు చూపి సర్టిఫికెట్లు పొందాలని అనుకునే వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

మారుపేర్ల బాధితుల దర్నా

జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

రామగిరి, ఫిబ్రవరి 4 : ఆర్జీ-3 జీఎం కార్యా ల యం ఎదుట ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మారుపేర్ల బాధితులు ధర్నా చేశారు. సింగరేణిలో అనేక మంది కార్మికులకు మార్లుపేర్లు ఉన్నాయని, మార్పు కోసం దరఖాస్తు చేసుకున్నా విజిలెన్స్ విచారణ పేరిట జాప్యం చేస్తున్నారని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆకుల వెంకన్న తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ అశోక్, మారుపేర్ల బాధిత సంఘం నాయకులు కాంతయ్య, శ్రావణ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★Pathipaka Nehancy D/o. Pathipaka Harish, Mother Name Pathipaka Ramya (Old Name) H.No. 8-4-9 Gandhinagar, Sircilla Town & Mandal, Rajanna Sircilla Dist. My Name was changed to **Pathipaka Himasutha** (New Name)
NTK-00000

CHANGE OF NAME

★I, BOGA KRSHNAHARI S/o. Boga Narsaiah R/o. H.No. 4-66, Kistampet, Raikal, Jagtial, T.S. I have changed my Name as **BOGA KRISHNAHARI** S/o. Narsaiah.
NTK-00000

CHANGE OF NAME

★Pathipaka Latha W/o. Pathipaka Srinivas (Old Name) H.No. 5-4-50, Pathipaka Street, Sircilla Town, Rajanna Sircilla Dist. My Name was changed to **PATHIPAKA VANI W/O. PATHIPAKA SRINIVAS** (New Name)
NTK-00000

CHANGE OF NAME

★I **REDDY SHIRISHA** W/o.REDDY VISHNU VARDHAN REDDY, HNO 10-3-493/A/10, FLAT NO 302, ROAD NO 5, MARVEL APARTMENT, VIVEKANANDAPURI, TOWN&DIST KARIMNAGAR, TELANGANA 505001, CHANGED MY NAME AS **PITTALA SHIRISHA** W/o. **REDDY VISHNU VARDHAN REDDY**
NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

తప్పుల తడకగా కుల గణన

- పదేళ్లలో బీసీల జనాభా తగ్గిందా?
- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెలి శంకర్

కమాన్‌పూర్, ఫిబ్రవరి 4: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బీసీ కుల గణన సర్వే తప్పుల తడకగా ఉందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ ఆరోపించారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014లో 51 శాతం బీసీ జనాభా ఉంటే 2024 వరకు 21 లక్షలు తక్కువగా చేసి చూపించారని మండిపడ్డారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ కుల గణనపై ఉన్న చిత్త శుద్ధి ఏమిటో తేటతెల్లం చేస్తున్నదని విమర్శించారు. బీసీ కుల గణన సర్వేకు అగ్ర వర్ణానికి చెందిన మంత్రిని చైర్మన్‌గా నియమించడంలోనే లోగుట్టు ఏమిటో ఎవరికైనా అర్థమైపోతుందన్నారు. బీసీ కుల గణన నివేదిక కేబినెట్ ముందుకు రాక ముందే, ఎలా బహిర్గతం చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీసీల జనాభా మాత్రమే తగ్గుతుందని కుల గణన సర్వేలో వెల్లడించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ సర్వేపై సందేహాలు వ్యక్తమవుతున్నాయన్నారు.మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన మోసపూరిత వైఖరిలో మార్పు చేసుకోవాలని హితవు పలికారు. లేని పక్షంలో రాబోయే కాలంలో ప్రజలే కాంగ్రెస్ సర్కార్‌ను మార్పు చేస్తారని హెచ్చరించారు. సర్వే పత్రాలు చెత్త బుట్టల దాఖలాలు కావడం తప్ప.. వాటితో ఏమి ప్రయోజనం లేదని పేర్కొన్నారు.

తహసీల్దార్ల బదిలీ

పెద్దపల్లి, ఫిబ్రవరి4: జిల్లాలోని పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి తసీల్దార్ రాజ్‌కుమార్‌ను మంథ